



మంగళవారం తెలంగాణ భవన్‌లో కొడంగల్, లగచర్ల బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, దేశపతి శ్రీనివాస్, పొన్నాల లక్ష్మయ్య, ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్, ఆనంద్, కౌశిక్‌రెడ్డి, నగేశ్ తదితరులున్నారు

# లగచర్ల రైతులకు బేడీలా!

## కేసులు ఎత్తేయాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతుల వెల్లువ • ప్రభుత్వ పాశవిక చర్యలపై బీఆర్‌ఎస్ నిరసనలు

రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఫార్మా సిటీ ఏర్పాటుకు వికారాబాద్ జిల్లాలో ఇటీవల భూసేకరణ చేపట్టింది. తమకు జీవనాధారం లేకుండా పోతున్నదని ఆందోళన చెందిన లగచర్ల గ్రామానికి చెందిన రైతులు ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకున్నారు. దీంతో భూసేకరణను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన లగచర్ల రైతులపై కేసులు పెట్టి బేడీలు వేసి జైలులో వేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. పేద రైతులు బెయిల్ కోసం ఎంత శ్రమిస్తున్నా ఫలితం లేకుండా పోతుండటంతో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వారికి అండగా నిలిచారు. కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం బీఆర్‌ఎస్ శ్రేణులు లగచర్ల రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయాలని అంబేద్కర్ విగ్రహాలకు వినతులు అందజేసి నిరసన తెలిపారు.



లగచర్ల రైతులపై అక్రమ కేసులకు నిరసనగా నల్లచొక్కాతో అసెంబ్లీలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే మల్లారెడ్డి

- కేపీహెచ్‌బీ కాలనీ : ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్లు చరిత్రలో లేదని, లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ప్రభుత్వం విరమించుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నల్లచొక్కా ధరించి ఎమ్మెల్యే కృష్ణారావు నిరసనలో పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం లగిచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, జైళ్లలో నిర్బంధించడం బాధాకరమన్నారు.
- కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్‌నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన గళాన్ని విప్పారు. జీడిమెట్ల డివిజన్‌లో అంబేద్కర్ విగ్రహానికి వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు.
- బడంగ్‌పేట: లగచర్ల రైతులపై పెట్టిన కేసులను బేషరత్‌గా ఎత్తివేయాలని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న దుర్మార్గాలను, రైతులపై సాగిస్తున్న దమనకాండను మానుకొని మంచి మార్గంలో నడవడానికి బుద్ధి ప్రసాదించాలని మహేశ్వరం నియోజక వర్గం బీఆర్‌ఎస్ నేతలు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపు మేరకు మహేశ్వరం నియోజకవర్గం వ్యాప్తంగా లగచర్ల రైతులపై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళనలు, నిరసనలు చేపట్టారు.
- ఎల్బీనగర్ : లగచర్ల రైతులకు సంఘీభావంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సహచర ఎమ్మెల్యేలతో కలిసి నల్లరంగు షర్టులు ధరించి చేతులకు బేడీలు వేసుకుని అసెంబ్లీకి హాజరయ్యారు. ఇదేమీ రాజ్యం, ఇదేమీ రాజ్యం, ఖాకీ రాజ్యం, దోపిడీ రాజ్యం, లాఠీ రాజ్యం, లూటీ రాజ్యం, రైతులకు సంకెళ్లా సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు.



లగచర్ల రైతులపై జరిగిన దాడిని నిరసిస్తూ జిల్లెలగూడలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, అర్కల కామేశ్ రెడ్డి



బంజారాహిల్స్ రోడ్ నం.1లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు



బాలాపూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



యూసుఫ్‌గూడలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్లు రాజ్‌కుమార్‌పటేల్, దేదీప్య విజయ్, బీఆర్‌ఎస్ శ్రేణులు



సీతాఫల్‌మండి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సికింద్రాబాద్ కార్పొరేటర్ హేమ, బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ శైలజ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు



ఓయూ లా కళాశాలలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన బీఆర్‌ఎస్వీ నాయకులు



మేడ్చల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నేతలు



హస్మత్‌పేట చౌరస్తా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్, బీఆర్‌ఎస్ శ్రేణులు



వివేకానందనగర్ డివిజన్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ శ్రేణులతో నిరసనలో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి



నానక్‌రాంగూడలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొమిరిశెట్టి సాయిబాబా తదితరులు



తుకారాంగేట్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి తదితరులు



లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న పీర్జాదిగూడ మాజీ మేయర్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు

## లగచర్ల రైతులపై అక్రమ కేసులు సిగ్గు, సిగ్గు : ఉద్యమకారులు రామ్, లక్ష్మణ్

చంపాపేట : తమ భూములు లాక్కొని రాష్ట్ర ప్రభుత్వం తమకు అన్యాయం చేయొద్దని లగచర్ల రైతులు నిరాకరించినందుకు వారిపై అక్రమ కేసుల బనాయించి పోలీస్ ఇంట్రాగేషన్ పేరుతో థర్డ్‌డిగ్రీ ప్రయోగించి వారిని కటకటాల్లో బంధించి ప్రభుత్వం పైచాచిక ఆనందం పొందడం సిగ్గు, సిగ్గని మలిదశ ఉద్యమకారులు రామ్, లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం రామ్, లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో చంపాపేట చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు పైడిమర్రి నాగభూషణం, ధర్వేశ్, శ్రీను, మబీబ్, రాఖీ తదితరులు పాల్గొన్నారు.



చంపాపేట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు రామ్, లక్ష్మణ్




ఉప్పల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## చర్లపల్లి సమస్యలు పరిష్కరించాలి

### అసెంబ్లీలో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



కాప్రా, డిసెంబర్ 17: ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని చర్లపల్లి సమస్యలపై మంగళవారం అసెంబ్లీలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడారు. చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సికిందరాబాద్ రైల్వేస్టేషన్ నుంచి పలు రైళ్లు మూవ్ చేస్తున్నారని, అయితే చర్లపల్లి వెళ్లాలంటే రోడ్లు, డ్రెయిన్స్, ఇతర సౌకర్యాలు సరిగాలేవని, అలాగే రాత్రి వేళ వీధిదీపాలు కూడా వెలుగవన్నారు. ఏడాది కాలంగా వీధిదీపాలు లేక అవస్థలు పడుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ వారిని అడిగితే లైట్లు లేవని అంటున్నారన్నారు. చర్లపల్లిలో ఉన్న మూడు చెరువుల్లో పూడిక తీయాలని, సిటీ నుంచి అందరూ ఇటువైపు వస్తారని, వెంటనే చెరువుల్లో గుర్రపు డెక్కను తొలగించాలని, ఇక్కడి సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## జలమండలిలో కారుణ్య నియామకాలు



సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): జలమండలిలో నలుగురికి కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు లభించాయి. బోర్డులో విధులు నిర్వర్తిస్తూ ఉండగా మరణించిన నలుగురి ఉద్యోగుల వారసులకు వారి వారి విద్యార్హతలు బట్టి, కారుణ్య నియామకం కింద ఉపాధి కల్పించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాల్ని ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ వారికి అందించారు. ఈసందర్భంగా ఆయన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఅండ్‌ఏ సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఇతరులు పాల్గొన్నారు.

## దేశ రక్షణలో ఎంసీఈఎంఈ కీలక పాత్ర

### గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ


బొల్లారం, డిసెంబర్ 17: అత్యుత్తమ యుద్ధానికి సిద్ధంగా ఉన్న సాంకేతిక నిపుణులను ప్రోత్సహించడంలో ఎంసీఈఎంఈ ఆదర్శవంతమైన శిక్షణా ప్రమాణాలను అందిస్తుందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రశంసించారు. మంగళవారం తిరుమలగిరి ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో 106వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే హాజరయ్యారు. ఈ మేరకు స్నాతకోత్సవంలో టెక్నికల్ ఎంట్రీ స్కీం కోర్సు(టీఈఎస్-42)లో శిక్షణ పొందిన 105 మంది మిలిటరీ అధికారులకు ఇంజినీరింగ్ పట్టాలు అందజేశారు. అనంతరం లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే మాట్లాడుతూ.. దేశ రక్షణ వ్యవస్థలో ఎంసీఈఎంఈ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మిలిటరీ అధికారులకు గోల్డ్, సిల్వర్ పతకాలను అందజేశారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

### సమీక్షలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికిగానూ ఇంజినీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. మంగళవారం సీఈ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ సీఈ పనస రెడ్డిలతో కలిసి కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోన్లవారీగా వాటర్ లాగింగ్ పాయింట్స్, రెయిన్ వాటర్ హోల్డింగ్ స్ట్రక్చర్, ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనులపై సమీక్షించారు. గ్రేటర్‌లో ప్రజల అవసరాల దృష్ట్యా చేపట్టిన పనులను ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నిర్దేశించిన కాల వ్యవధిలో పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించాలన్నారు. 141 వాటర్ లాగింగ్ పాయింట్‌లను తగ్గించేందుకు శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వచ్చే వర్షాకాలంలో సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి దశలో 12 వాటర్ హోల్డింగ్ నిర్మాణాలను చేపట్టగా.. అందులో 4 పనులు పూర్తి కాగా, మిగతా పనులు వివిధ ప్రగతి దశలో ఉన్నాయని, జనవరిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. హోల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణాలకు ఫీజిబిల్టీ గుర్తించాలన్నారు. 125 జంక్షన్ల అభివృద్ధికి గుర్తించిన నేపథ్యంలో భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్ సమస్య పరిష్కారానికి ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, ఎలక్ట్రికల్, ప్రకటనలు, యూబీడీ విభాగాల అధికారులతో కమిటీ వేసినట్లు, ఈ కమిటీ జంక్షన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రేటర్‌లో రూ.124.68కోట్లతో 195 సుందరీకరణ పనులు చేపట్టగా, అందులో 28 పనులు పూర్తి కాగా, 167 పనులు అభివృద్ధి దశలో ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అసంపూర్తి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి పాదచారులకు ఇబ్బందుల్లేకుండా టెక్నికల్ ఫిజిబిలిటీ ప్రదేశాల్లో కొత్తగా ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలను ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అసిస్టెంట్ ఇంజినీర్లు పృథ్వీ, బాలాజీ, జోనల్ ఎస్‌ఈలు రత్నాకర్, మహేశ్‌రెడ్డి, నిత్యానంద, శంకర్, చిన్నారెడ్డి, ఈఈలు పాల్గొన్నారు.



సమీక్షలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

## ఎస్సీ కులాల వినతుల నివేదిక సర్కార్‌కు అందిస్తాం

సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): ఎస్సీ కులాల ఉపవర్గీకరణ కోసం బహిరంగ విచారణ నిర్వహించామని, ఎస్సీ కులాల నుంచి వినతులను స్వీకరించామని ఎస్సీ ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల విచారణ కమిషన్ ఆధ్వర్యంలో విలేకరలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ కుల సంఘాల నుంచి 31 వినతులు అందాయని వివరించారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన న్యాయపరమైన అంశాలు, ఉద్యోగ, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ వినతులన్నింటిని నివేదిక రూపంలో సర్కార్‌కు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ షమీమ్

## అధ్యయనం కవిత్వానికి ప్రాణం వంటిది..

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 17: అధ్యయనం కవిత్వానికి ప్రాణం వంటిదని సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందని సిధారెడ్డి అన్నారు. తెలంగాన సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన వచన కవిత్వ అధ్యయన శిబిరంలో ప్రధాన వక్తగా పాల్గొన్న సిధారెడ్డి ప్రసంగిస్తూ కాలనికి అనుగుణంగా సమకాలీన అంశాలపై మంచి కవిత్వం రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ కవి, విమర్శకులు డాక్టర్ కాంచనపల్లి గోవర్ధనరాజు కవిత్వానికి ప్రేరణ, సాధన అనే అంశంపై, ప్రముఖ కవి డాక్టర్ యాకూబ్ పాల్గొని కవిత్వం భాషా నిర్వహణ అనే అంశంపై, ప్రముఖ కవి, కథారచయిత డాక్టర్ పసునూరి రవీందర్ కవిత్వం-దృక్పథం అనే అంశంపై ప్రసంగిస్తూ కవిత్వానికి దృక్పథం లేకపోతే చీకటిలో వేసినబాణం అవుతుందన్నారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా.జె.చెన్నయ్య, కవి డా.మల్లెగోడ గంగాప్రసాద్ పాల్గొన్న ఈకార్యక్రమంలో తెలంగాణ జిల్లాలతోపాటు చిత్తూరు నుంచి ఔత్సాహిక సాహితీవేత్తలు పాల్గొన్నారు.